నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 8 జనవరి 2024 | ADILABAD



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

## బాధిత కుటుంబాలకు పరామర్శ

నిర్మల్ అర్బన్, జనవరి 7: నిర్మల్ పట్టణంలోని వినాయక్ నగర్‌కు చెందిన జలపతి రావు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని సంతాపాన్ని వ్యక్తం చేశారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, అల్లోల సురేందర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## నాందేవ్‌కాంబ్లే 78వ జయంతి



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ నగేశ్

ఎదులాపురం, జనవరి 7: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నాందేవ్ కాంబ్లే 78వ జయంతిని అన్నాబావు సాఠే సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నాందేవ్ కాంబ్లే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నగేశ్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, అన్నాబావు సాఠే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే ఉద్ధవ్, దళిత సంఘాల నాయకులు సందీప్, ప్రశాంత్ ,సీనియర్ నాయకులు యూనిస్ అక్బాని, మెట్టు ప్రహ్లాద్, బీ సూర్యకాంత్, నాందేవ్, మాధవ్, గణేశ్, అర్జున్ జ్ఞానోబా తదితరులున్నారు.



సోన్ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## అపూర్వ సమ్మేళనం..

సోన్, జనవరి 7: మండల కేంద్రంలోని జడ్పీ హెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చదువుల అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 20 ఏండ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపి, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు.



దిలావర్‌పూర్: గుండంపల్లిలో మాట్లాడుతున్న నిజ నిర్ధారణ కమిటీ సభ్యుడు ధర్మార్జున్

## ఇథనాల్ పరిశ్రమతో నష్టాలే ఎక్కువ

### నిజనిర్ధారణ కమిటీ సభ్యుడు ధర్మార్జున్

దిలావర్‌పూర్ జనవరి 7: ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయని నిజనిర్ధారణ కమిటీ సభ్యులు ధర్మార్జున్ అన్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామంలో ఇథనాల్ పరిశ్రమపై రైతులకు టీజేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ ఇథనాల్ పరిశ్రమతో రైతులకు ప్రయోజనం లేదని చెప్పారు. కంపెనీ చెప్పే నిజాలకంటే అసత్యాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. చిత్తనూరులో కూడా రైతులను మభ్యపెట్టి ఈ పరిశ్రమ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# రైతు బంధు ఎప్పుడత్తదో..

### పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపులు

- రేపు, మాపు అంటున్న అధికార యంత్రాంగం
- యాసంగి పంటల ఖర్చులకు తప్పని ఇక్కట్లు
- సీజన్ ప్రారంభమై నెల దాటినా ఖాతాల్లో పడని నగదు
- అప్పల కోసం పడరాని పాట్లు
- త్వరగా అందించాలని రైతన్నల వినతి

*రైతుబంధు సాయం కోసం రైతాంగం ఎదురు చూస్తున్నది. యాసంగి సీజన్ మొదలై నెల గడుస్తున్నా, పంట పెట్టుబడి సాయం అందక ఆందోళన చెందుతున్నది. నేడు, రేపు అంటూ అధికార యంత్రాంగం చెబుతుండగా, సకాలంలో అందకపోవడంతో కర్షకలోకం నిరాశ చెందుతున్నది. రైతాంగానికి అండగా నిలవడంలో భాగంగా గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏడాదికి రెండు విడుతలుగా ఈ సాయం అందించింది. కాగా, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎకరాలోపు మినహా మిగతా వారికి ఇప్పటివరకు అందించకపోవడంతో, ఎప్పుడొత్తదోనని ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.*



ఆదిలాబాద్, జనవరి 7(నమస్తే తెలంగాణ): రైతుబంధు సాయం కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. యాసంగి సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా, ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 1,64,124 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు. మొత్తంగా వీరి బ్యాంకు ఖాతాల్లో రూ.286 కోట్లు జమ కావాల్సి ఉంది. వానకాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులందరికీ రైతుబంధు సాయాన్ని పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి సీజన్‌కు రైతుబంధు సాయాన్ని అందిస్తామని ప్రకటించినా, ఇప్పటికీ ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు ఎకరం లోపు కేవలం 35 గుంటలు భూమి ఉన్న 10,056 మంది రైతులకు రూ.3.07 కోట్ల పంట పెట్టుబడి సాయం అందింది. మిగతా రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల కింద 35 గుంటలు భూమి ఉన్న వారికి పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాల్లో పడింది. ఆ తర్వాత వారికి నిలిపివేశారు. పంటల సాగుకు అయ్యే ఖర్చు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంటపెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

### కేసీఆర్ సర్కారు హయాంలో..

రైతులు పంట పెట్టుబడుల కోసం అప్పులు చేయకుండా గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా ఏటా రెండు పంటలకు గానూ ఎకరాకు రూ. 10 వేల సాయాన్ని కేసీఆర్ ప్రభుత్వం పంపిణీ చేసింది. గత ప్రభుత్వం అందించిన సాయంతో రైతులు వానకాలం, యాసంగి పంటలను సాగు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి సీజన్‌కు ముందుగానే రైతులకు రైతుబంధు సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. మొదటి రోజు ఎకరం లోపు భూమి ఉన్న రైతులందరికీ రూ. 5వేల పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. మరుసటి రోజు రెండెకరాలు, మూడో రోజు మూడెకరాలు ఇలా పెంచుకుంటూ పోతూ రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేది. దీంతో రైతులు సీజన్‌కు ముందుగానే తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సంతోషంగా పంటలు పండించారు. ఈ ఏడాది యాసంగి సీజన్ ప్రారంభమై, నెల రోజులు దాటినా రైతుబంధు డబ్బులు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### అప్ప తెచ్చి పంట వేసిన..



తాంసి, జనవరి 7: గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పెట్టకుంటే మా పరిస్థితి మరోలా ఉండేది. మా ఊరిలో పంటలన్నీ బోర్లపైనే ఆధారపడి ఉన్నాయి. గతంలో పంటలు సాగు చేయాలంటే అప్పుజేసేటోళ్లం. అప్పు తెచ్చి పంట వేసినా కరెంటు లేక ఎండిపోయి శానా సార్లు నష్టపోయాం. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ ఒక పక్క కరెంటు ఇచ్చుకుంటూ.. మరో పక్క రైతుబంధు కింద డబ్బులు ఇచ్చిన్రు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇంకా ఇవ్వలేదు. దీంతో పెట్టుబడికి దళారుల వద్ద మిత్తికి డబ్బులు తీసుకొని విత్తనాలు, ఎరువులు కొన్న, గిప్పుడు మళ్లీ మా రైతులకు అప్పు తెచ్చే కష్టాలు మొదలైనయ్. వెంటనే ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. *- ముస్కు సురేశ్ రెడ్డి, రైతు, బండల్ నాగపూర్*

### ఇగ ఇస్తరో.. లేదో!



తాంసి, జనవరి 7: ఇద్వారి దాక రైతుబంధు ఎప్పుడో అస్తుండె. ఎవుసం రెండో పంటకు పెట్టుబడి ఖర్చు పెట్టుంటిమి. మా కుటుంబానికి గుబిడి శివారుల ఐదెకరాల భూమి ఉన్నది. గీ భూమిల మూడెకర్లు పత్తి, రెండెకర్లు మిర్చి ఏసిన. రైతుబంధు అస్తే.. రెండో పంటకు పనికి అస్తయనుకుంటే అవ్విటి పత్తా లేదు. పత్తుల ధరలు నీరూటి అంత కూడా లేవు. మిర్చి పంట సమయం రాలే. ఎట్ల చేయ్యాలనో అర్థం కావాట్లే. కాంగ్రెస్ సర్కారు గిట్ల రైతులతోని ఆడుకుంటదని అనుకోలేదు. రైతు బంధు ఇగ ఇస్తరో.. ఇయ్యరో అని అందరూ అనుకుంటున్నరు. *-సరసన్ కిష్టారెడ్డి, రైతు, గుబిడి, భీంపూర్ మండలం*

### కేసీఆర్ సారు యాదికొస్తుండు..



తాంసి, జనవరి 7: యాసంగి సీజన్‌లో ఐదెకరాల్లో శనగ పండిస్తున్న. ఈ సారి పెట్టుబడి సాయం అందక మస్తు పరేషాన్ అవుతున్నది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ముందుగాల్నే అకౌంట్‌లో రైతుబంధు పైసలు జమ చేసేది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ వచ్చి రైతుబంధు ఇస్తదో.. లేదో ఏం తెలుస్తలే. మళ్లీ పాత రోజులే యాదికొస్తున్నాయి. పెట్టుబడి సాయం పడిందా అని రోజూ ఫోన్‌లో వచ్చిన మేసేజ్‌లు జూస్తున్న. కానీ ఇంత వరకు రైతుబంధు పడలే. మళ్లీ దళారుల దందా మొదలైంది. మా రైతులను ఆదుకున్న కేసీఆర్ సారే యాదికొస్తున్నడు. *-అలాలి నర్సింహులు, హస్నాపూర్*

### ఎప్పుడో ఖాతాల్లో పడుతుండే..



తాంసి, జనవరి 7: మా కుటుంబానికి మూడెకరాల భూమి ఉన్నది. ఇప్పుడు చేండ్ల పత్తి పంట కాలం అయిపోతున్నది. గీ పత్తి జాగల రెండో పంటగా శనగ ఏద్దామంటే ఇగో ఇద్వారి దాక రైతుబంధు జాడ లేదు. ఏండ్ల సంది కేసీఆర్ సారు మా బ్యాంకు ఖాతాల్లో గీ టైముకు ఏసేస్తుండే. గా పైసల్ని బట్టి ఎవుసం పని నడుస్తుండె. కొందరు రెండో పంట ఏసి నెలయ్యింది. ఇగ.. రైతుబంధు భరోసా లేదని మా గ్రామంల అంటున్నరు. ఇగో నిజం చెప్పాలంటే గిప్పుడు అందరికీ కేసీఆర్ సారు మతికస్తున్నడు. ఇప్పటికైనా సర్కారు రైతుబంధు పైసలియ్యాలె. *- నక్క లక్ష్మి, సర్పంచ్, గుబ్‌డిపల్లి, భీంపూర్ మండలం*



వాకింగ్ చేస్తున్న యువకులు,ప్రజలు

## అడుగేద్దాం.. రోగాలు తరిమేద్దాం..

- నడకతో సంపూర్ణ ఆరోగ్యం
- సహజ వ్యాయామాలతో సత్ఫలితాలు

దస్తురాబాద్,జనవరి 7 : పూర్వపు రోజుల్లో ప్రజలు వ్యవసాయ పొలాలు, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే నడుస్తూనే గమ్యాలను చేరుకునేవారు. నిత్యం నడవడంతో శారీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. ప్రస్తుతం యాంత్రిక జీవన విధానంలో పల్లె,పట్టణం అన్న తేడా లేకుండా శారీరక శ్రమ తగ్గింది. తీసుకునే ఆహారానికి తగిన శ్రమ లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఇప్పుడు తప్పని పరిస్థితి అయ్యింది. ఇందుకు ఉదయం నడక, యోగా, వ్యాయామం. ఇలా ఏదో ఒకటి అనుసరించడం తప్పనిసరి. సాంకేతిక జీవనంలో మనిషి తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మానసిక ఒత్తిడిని అధిగమించి, సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు అరగంట పాటు నడకతో పాటు వ్యాయామానికి వెచ్చించాలని నిపుణులు చెబుతున్నారు.

### నడకతో లాభాలు..

- మానసిక ఒత్తిడి తగ్గిస్తుంది. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుంది. • దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తుంది.
- జీర్ణ శక్తి క్రియ మెరుగుపర్చడంతో పాటు మలబద్దకం నివారించి, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రానివ్వదు.
- కీళ్ళ నొప్పులు,వెన్ను నొప్పులను తగ్గిస్తుంది. • అధిక బరువును,కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. • ఉదయం పూట నడిస్తే జ్ఞాపక శక్తి పెరిగి, మెదడు చురుగ్గా పని చేస్తుంది. • ఉదయం వేళ స్వచ్ఛమైన ప్రాణవాయువు(ఆక్సిజన్) పీల్చుకోవడంతో శరీర కణాలు ఉత్తేజితమవుతాయి. • రాత్రి భోజనం తర్వాత కనీసం 10 నిమిషాల పాటు నడడం వలన గుండెపోటు సమస్యలు తగ్గడంతో పాటు, కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు రావు. • శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. • శ్వాస సంబంధిత వ్యాధులు, నొప్పులు తగ్గుతాయి. • ఎముకల్లో కాల్షియం స్థాయి పెరిగి గట్టిపడుతాయి.

### నడకతో వ్యాధులను నియంత్రివచ్చు



*జీవన శైలి వ్యాధులు సోకితే సహజంగా శారీరకధారుఢ్యంపై ప్రభావం చూపుతుంది. అవి రాకుండా ఉండాలంటే సహజ వ్యాయామాలతోనే జాగ్రత్త పడాలి. ఒక వేళ సోకినా నిత్యం నడక, చిన్నపాటి వ్యాయామాలతో వ్యాధులను నియంత్రించవచ్చు. ప్రతి రోజూ ఉదయం పూట ఒక అరగంట పాటు వాకింగ్, వ్యాయామాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాం.*

*-టీ.వేణు గోపాల్, హెచ్‌ఈవో, పీహెచ్‌సీ,దస్తురాబాద్*

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- బుగ్గారం (బీ)లో బీటీ రోడ్డు పనులు ప్రారంభం

నేరడిగొండ, జనవరి 7: నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడానికి బాధ్యతగా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మండలంలోని బుగ్గారం (బీ) గ్రామంలో బీటీ రోడ్డు పనులకు ఆదివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు తాను ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. గ్రామంలోని సమస్యలు ఎమ్మెల్యేకు గ్రామస్తులు విన్నవించారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.



బుగ్గారంలో బీటీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### కళాశాల తనిఖీ

గ్రామంలోని టీటీడబ్ల్యూఆర్జేసీ(తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్‌గ్రేడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల( బాలికలు)ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. కళాశాలలోని వివిధ గదులను పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల బాధ్యత తనదేనని, కళాశాలలో సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. త్వరలోనే మళ్లీ కళాశాలకు వస్తానని చెప్పారు. ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, జానుబాయి, విశాల్ కుమార్, అశోక్, జంగు, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, సురేందర్, రాజశేఖర్, కృష్ణనాయక్, గులాబ్‌సింగ్, బాబూలాల్, ప్రతాప్‌సింగ్, అంబారావ్, జాదవ్ వసంత్‌రావ్, కృష్ణ, భీంరావ్, కరణ్‌సింగ్, శేఖర్, పాండు, తదితరులున్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

ఇచ్చోడ, జనవరి 7: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని ఎల్లమ్మగూడ యువకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రశాంతమైన వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, క్రీడా స్ఫూర్తిని పాటించాలని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఏనుగుల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, విద్యార్థులు

## ట్రిపుల్ ఐటీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం

*బాసర ఆర్జీయూకేటీలో ఆదివారం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ముందుగా ట్రిపుల్ఐటీ డైరెక్టర్ సతీశ్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు దిశానిర్దేశం చేసేందుకు గాను కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలలో 500 మంది విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థుల కల్చరల్ యాక్టివిటీస్ ఆకట్టుకున్నాయి. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాకేశ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. రామారావు, డా. రాములు, డా. రమాదేవి, డా. శ్రావణ్, డా. విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.* *- బాసర, జనవరి 7*



కల్చరల్ ప్రోగ్రాం చేస్తున్న విద్యార్థులు



క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న ఐటీడీఏ పీవో చాహత్ భాజ్‌పాయ్, సీఎండీ వరుణ్‌రెడ్డి

# రాష్ట్రస్థాయి విజేతలకు ఘన స్వాగతం

ఆదిలాబాద్ రూరల్/ఉట్నూర్, జనవరి 7: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానిలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న ఉట్నూర్ క్రీడాపాఠశాల జట్టుకు ఆదివారం ఉదయం ఘన స్వాగతం పలికారు. ఐబీ చౌరస్తా వద్ద బాణసంచా కాల్చారు. పూల వర్షం కురిపించారు. క్రీడాకారులకు పూలమాలలు వేసి మిఠాయిలు తినిపించారు. డీజే చప్పుళ్లకు అనుగుణంగా సాధించిన కప్పులను ప్రదర్శిస్తూ నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, డీడీ దిలీప్ కుమార్, జిల్లా గిరిజన క్రీడల అధికారి కే పార్థసారథి, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏసీఎంవో జగన్ విద్యార్థులను అభినందించారు. వారు సైతం కప్పులతో నృత్యాలు చేస్తూ ఉత్సాహరిచారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన క్రీడోత్సవాల్లో ఐటీడీఏ ఉట్నూర్ క్రీడాకారులు తొలిసారి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, పీఈటీలు కోచ్‌లను అభినందించారు. రాబోయే ఐఎస్ఎల్ క్రీడల్లోనూ సత్తా చాటాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీలో క్రీడల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ప్రధానోపాధ్యాయులు చందన్, కృష్ణారావ్, ఉత్తమ్, జే ప్రేమ్‌దాస్, గిరిజన సహాయ క్రీడల అధికారులు భూక్యా రమేశ్, హేమంత్, రవీందర్, శ్రీనివాస్, గోపాల్, జలపతి పాల్గొన్నారు.



పొల్లుగూడలో సమావేశమైన జుగ్నాక్ వంశీయులు

## ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

ఇంద్రవెల్లి, జనవరి 7: మండలంలోని వాల్గొండ గ్రామపంచాయతీ పరిధిలోని పొల్లుగూడ గ్రామంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలోని జుగ్నాక్ వంశీయుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చే నెల పుష్యమాసం కావడంతో కులదేవతలతో పాటు పెర్సపేన్, సతీక్ దేవుళ్లకు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. కొత్తగా నిర్మించిన సతీక్ దేవత ఆలయ ప్రారంభోత్సవం మే నెలలో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి కుటుంబం నుంచి రూ. 3 వేలు విరాళంగా అందించాలని సమావేశంలో తీర్మానించారు. కటోడ జుగ్నాక్ మహదు, గ్రామపటేల్ కోరెంగా పొల్లు, ఇంద్రవెల్లి జీపీ మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్ రావ్, జుగ్నాక్ వంశీయుల పెద్ద దేవుడు కమిటీ అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, ప్రధాన కార్యదర్శి జుగ్నాక్ జాలిమ్, గ్రామస్తులు శంకర్, కాశీరాం, జ్యోతిరాం, లింగు, సంబన్న తదితరులు పాల్గొన్నారు.